న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

వీణవంక కేజీబీవీలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వీ అలేఖ్య, పక్కన మెజిస్ట్రేట్‌లు జీ స్వాతి, పద్మసాయి

వీణవంక, నవంబర్ 23: బాలికలు న్యాయచట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హుజూరాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.అలేఖ్య, అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ జి.స్వాతి, ఫస్ట్ అడిషనల్ జూనియర్ జడ్జి పద్మసాయి సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం హుజూరాబాద్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్‌లు పి.అలేఖ్య, జి.స్వాతి, పద్మసాయి మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో బాలికలు న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే రక్షణ సహాయం కోసం డయల్ 100కు కాల్ చేయాలని చెప్పారు. ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినా పోక్సో చట్టం ద్వారా న్యాయం జరుగుతుందని తెలిపారు. మైనర్ డ్రైవింగ్, డ్రగ్స్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో అడ్వకేట్, లోక్‌అదాలత్ మెంబర్ వై.అరుణ్‌కుమార్, న్యాయవాదులు తిరుపతి, భానుకిరణ్, లీగల్ అడ్వైజర్లు వెంకన్న, శైలజ, కేజీబీవీ ఎస్‌వో సునీత, తదితరులు పాల్గొన్నారు.

కిట్స్‌లో ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 23: సింగాపూర్ గ్రామంలోని కిట్స్ కాలేజీలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ శంకర్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ 76వ ఆవిర్భావ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిట్స్ ఎన్‌సీసీ కెడెట్స్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మేజర్ రవీంద్ర బాబు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలలో ప్రసవాల సంఖ్య పెంచాలి

- గర్భిణుల్లో రక్తహీనత నివారించాలి
- వైద్యాధికారుల సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

విద్యానగర్, నవంబర్ 23: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని కలెక్టర్ పమేలా సత్పతి వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం వైద్యశాఖ అధికారులు, మెడికల్ ఆఫీసర్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మొత్తం ప్రసవాల్లో 20 శాతం ప్రసవాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగేలా చూడాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. గర్భిణులకు సాధారణ ప్రసవంపై నమ్మకం కలిగేలా కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. హిమోగ్లోబిన్ పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించి గర్భిణీకి తగిన మోతాదులో మందులు అందజేసి రక్తహీనత నివారించాలన్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్ నిబంధనలు తప్పకుండా పాటించేలా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ఆర్ఎంపీ క్లినిక్‌లను రెండు నెలలకు ఒకసారి సందర్శించాలని తెలిపారు. ఆర్ఎంపీలు వారికి అనుమతి ఉన్నమేరకు మాత్రమే వైద్యం చేయాలన్నారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు గర్భిణులకు సంబంధించిన ఎల్ఎంపీ సర్వేను పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రపుల్‌దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, అడిషనల్ డీఎంహెచ్‌వో సుజాత, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, డీటీసీవో రవీందర్, డీఐవో సాజిదా, ఉమశ్రీ పాల్గొన్నారు.

'సీఎంఆర్ఎఫ్ చెక్కులు ప్రభుత్వానివా.. కాంగ్రెస్ పార్టీవా?'

వీణవంక, నవంబర్ 23: 'మండలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన వొడితెల ప్రణవ్ ఎవరు.. ప్రజాప్రతినిధా.. ప్రభుత్వ నామినేటెడ్ వ్యక్తా.. చెక్కులు ప్రభుత్వానివా.. కాంగ్రెస్ పార్టీవా?' అని బీజేపీ మండలాధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి ప్రశ్నించారు. శనివారం మండలంలోని చల్లూరు గ్రామంలో ఆయన మాట్లాడుతూ, ప్రణవ్‌కు ఏ ప్రొటోకాల్ ప్రకారం పోలీసు భద్రత, బందోబస్తు కల్పిస్తారని నిలదీశారు. ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. ఎలాంటి అర్హత లేకుండా ప్రభుత్వ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన వొడితెల ప్రణవ్‌పై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నరసింహారాజు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి మంచినీటి సరఫరాపై కార్పొరేటర్ నిరసన

కార్పొరేషన్, నవంబర్ 23: తమ డివిజన్‌లోనే రిజర్వాయర్ ఉన్నా స్థానికులకు మాత్రం అర్ధరాత్రి మంచినీటి సరఫరా చేస్తున్నారంటూ 24వ డివిజన్ కార్పొరేటర్ కుర్ర తిరుపతి, డివిజన్ ప్రజలు శనివారం నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ చాంబర్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఈ విషయాన్ని గతంలోనే అనేక మార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోవడం లేదని, దీని వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే, సీఎం అస్యూరెన్స్ కింద ఏడాది క్రితం చేపట్టిన డ్రైనేజీ పనులను ఇప్పటి వరకు మొదలు పెట్టడం లేదని విమర్శించారు. ఈ విషయంలో వెంటనే స్పందించాలని కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో డివిజన్ ప్రజలు ఖాజా, అమీర్, ప్రవీణ్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

తెలంగాణచౌక్, నవంబర్ 23: పెండింగ్ బిల్లులు చెల్లించాలని తాజామాజీ సర్పంచుల జేఏసీ జిల్లా ఇన్‌చార్జి కరుణాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్ భవనంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పెండింగ్ బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ఈ నెల 25న తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. మాజీ సర్పంచుల ఫోరం నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన వ్యాసాలు ఉత్తమ పరిశోధనలకు కొలమానాలు

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 23: ఉత్తమ పరిశోధనలకు పరిశోధకులు రాసిన వ్యాసాలు కొలమానాలు అని కాకతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ వరంగల్ ఈసీఈ విభాగం ప్రొఫెసర్ రాజగోపాల్ తెలిపారు. శనివారం సింగాపూర్ కిట్స్ కళాశాలలో డైరెక్టర్ డాక్టర్ శంకర్ అధ్యక్షతన 'పరిశోధకులు-పరిశోధన' అంశంపై నిర్వహించిన సెమినర్‌కు ఆయన ముఖ్యవక్తగా హాజరై అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డీన్, ఏఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ ప్రవీణ్ కుమార్ రావు, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ డీన్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సతీశ్ కుమార్, ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ వేణుగోపాల్‌తో పాటు వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు ఉన్నారు.

నేడు నియోజకవర్గంలో హరీశ్ రావు పర్యటన

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 23: సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆదివారం హుజూరాబాద్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి వీణవంకకు చేరుకుంటారు. అక్కడ అల్పాహారం చేసిన తర్వాత పార్టీశ్రేణులతో మాట్లాడుతారు. అనంతరం జమ్మికుంట మీదుగా హుజూరాబాద్ చేరుకుంటారు. ఇక్కడ పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇక్కడికి వస్తున్న హరీశ్‌రావుకు పెద్ద ఎత్తున స్వాగతం పలికేందుకు స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాయి. మాజీ మంత్రి హరీశ్ రావు హుజూరాబాద్ నియోజకవర్గంలో పర్యటనపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఆయన రాకతో గులాబీ క్యాడర్‌లో కొత్త జోష్ కనిపిస్తున్నది.

క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలి

మానకొండూర్, నవంబర్ 23: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి పోటీల్లో పాల్గొనాలని అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ సూచించారు. మానకొండూర్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న 'ఈషా గ్రామోత్సవ క్రీడా పోటీలు' శనివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపడానికి ఈపోటీలను నిర్వహిస్తున్న ఈషా ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. మహిళలకు త్రోబాల్, పురుషులకు వాలీబాల్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తుండగా, జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల నుంచి త్రోబాల్‌లో 8, వాలీబాల్‌లో 22 జట్లు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వరలక్ష్మి, ఎంఈవో మధుసూదనాచారి, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఈషా వలంటీర్లు గూడూరు మమత, రావుల ప్రదీప్, నాగరాజు, సుశాంత్, శ్రవణ్, సుచరిత్, ఆకాశ్, మధు, మేధా, రమ్య పాల్గొన్నారు.

బూరుగుపల్లి పాఠశాలలో విచారణ

గంగాధర, నవంబర్ 23: బూరుగుపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యాశాఖ, సివిల్ సప్లై శాఖ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురికాగా, డీఈవో జనార్దన్‌రావు, సివిల్‌సప్లై మేనేజర్ రజనీకాంత్ స్పందించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మూడు రకాలుగా వండి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కొత్త బియ్యం కావడంతో అన్నం మెత్తగా ఉడికి తినడానికి విద్యార్థులు ఇబ్బంది పడ్డారని తెలిపారు. ఉదయం పూట విద్యార్థులు ఇంటి వద్ద భోజనం చేసి రాకపోవడంతో కడుపులో ఆమ్లాలు ఎక్కువై మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురయ్యారని డీఈవో తెలిపారు. మధ్యాహ్న భోజనంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయంపై చర్యలు తీసుకుంటున్నారా? అని అడిగిన ప్రశ్నకు ఆ విషయం తనకు తెలియదని, సివిల్ సప్లై అధికారులను అడగాలని డీఈవో సమాధానమిచ్చారు. సివిల్ సప్లై జిల్లా మేనేజర్ రజనీకాంత్‌ను వివరణ కోరగా, బియ్యం క్వాలిటీలో ఎలాంటి సమస్యా లేదని, కొత్త బియ్యం కావడంతో అన్నం మెత్తగా ఉండికిందన్నారు. బియ్యం మార్చుతారా? లేక అదే బియ్యం వాడుతారా? అన్న ప్రశ్నకు పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అయితే, బియ్యం మార్చే వరకు తమ పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డించవద్దని విద్యార్థులు తల్లిదండ్రులు తేల్చి చెప్పారు. ఇక్కడ సివిల్ సప్లై అధికారి నర్సింగరావు, సాంకేతిక అధికారి సాయికుమార్, ఎంఈవో ప్రభాకర్‌రావు, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, వైద్యాధికారి శ్వేత, హెచ్ఎం మల్లికార్జున్, తదితరులు ఉన్నారు.

సీఎం కప్ యోగా పోటీలు కరీంనగర్‌లో నిర్వహించాలి

కొత్తపల్లి, నవంబర్ 23 : రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తలపెట్టిన సీఎం కప్ యోగా పోటీలు కరీంనగర్‌లో నిర్వహించాలని తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవిని కోరారు. ఈ మేరకు శనివారం రవీందర్‌సింగ్ తెలంగాణ యోగా అసోసియేషన్ ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డితో ఆమెను కలిసి, రాష్ట్రంలో యోగా అసోసియేషన్ కార్యకలాపాల గురించి వివరించారు. ప్రతిష్టాత్మకమైన సీఎం కప్‌లో యోగాకు అవకాశం ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదు గడువు పొడిగింపు

కలెక్టరేట్, నవంబర్ 23 : కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటర్ల నమోదు గడువు డిసెంబర్ 9 వరకు పొడిగించారు. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సి.సుదర్శన్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. ఓటరు నమోదు గడువు పొడిగించాలంటూ అనేక మంది చేసిన విజ్ఞప్తితో గడువు పెంచినట్లు ఆయన వెల్లడించారు. స్థానిక శాసన మండలి పరిధిలో వచ్చిన దరఖాస్తుల్లో 40వేల అర్జీలు తిరస్కరణకు గురయ్యాయని, వారంతా తిరిగి నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 15జిల్లాల పరిధిలో 3,58,579 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు కోసం గడువు పొడిగించడంపై తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దయాల ఓంప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు.

అద్వైతకు సీపీ అభినందనలు

అద్వైతను అభినందిస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

రామడుగు, నవంబర్ 23: గోపాల్‌రావుపేట అక్షర హైస్కూల్లో ఆరో తరగతి చదువుతున్న కమటం అద్వైత ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-14 బాలికల మైనస్ 22 కిలోల విభాగంలో కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయింది. డిసెంబర్ 11న పంజాబ్ రాష్ట్రం లూథియానాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నది. ఈ సందర్భంగా శనివారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతిని మర్యాదపూర్వకంగా కలిసిన అద్వైతను సీపీ అభినందించారు. ఇక్కడ అక్షర హైస్కూల్ కరస్పాండెంట్ మినుకుల మునీందర్, కరాటే మాస్టర్, అంతర్జాతీయ జపాన్ బ్లాక్‌బెల్ట్ డిప్లొమా కోచ్ సుంకె రాజు, జిల్లా కరాటే అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డా.బొల్లి ఐలయ్య, తదితరులు ఉన్నారు.

అఖిలపక్ష సమావేశాన్ని విజయవంతం చేయండి

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 23: ఈ నెల 26న మహాత్మానగర్‌లోని తాపాల నర సింహస్వామి ఆలయ ఆవరణలో మండలంలోని అన్ని పార్టీల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు సమన్వయ కమిటీ నాయకులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ, సమావేశంలో మండల కేంద్రంలోని బస్‌స్టేషన్ ఆవరణలో నెలకొల్పిన అంబేద్కర్, జగ్జీవన్ రాం విగ్రహాలపై ఉన్న ముసుగులను తొలగించడం కోసం భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి మాతంగి శంకర్, బీజేపీ మండలాధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వంతడుపుల సంపత్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సముద్రాల లక్ష్మణ్, మాజీ సర్పంచ్ వడ్లూరి శంకర్, సీపీఐ జిల్లా నాయకుడు గంగిపెల్లి శంకర్, ఆత్మ కమిటీ మాజీ సభ్యుడు పాశం అశోక్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఖమ్మం కృష్ణ, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

రామడుగు, నవంబర్ 23 : వెంకట్రావుపల్లిలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హంపి విరూపాక్ష విద్యారణ్య స్వామి ఆధ్వర్యంలో దేవతా మూర్తుల విగ్రహాలు ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంతోపాటు పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా లక్షదీప కాంతుల మహోత్సవం

ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కరీంనగర్ రూరల్, నవంబర్ 23: కార్తీక మాసం సందర్భంగా నగునూర్ గ్రామంలోని పరివార సమేత దుర్గాభవానీ ఆలయంలో శనివారం సాయంత్రం లక్ష దీపకాంతుల మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి, వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ వంగళ లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అకట్టుకున్న మాథ్స్ ఫెస్ట్

మాథ్స్ ఫెస్ట్‌ను ప్రారంభించి పరిశీలిస్తున్న మానేరు విద్యా సంస్థల అధినేత అనంతరెడ్డి

కొత్తపల్లి, నవంబర్ 23 : కరీంనగర్ శ్రీనగర్‌కాలనీలోని మానేర్ హగ్స్ అండ్ హార్ట్స్ ఇంటర్నేషనల్ కిడ్స్ పాఠశాలలో శనివారం మాథ్స్ ఫెస్ట్-2024 పేరిట నిర్వహించిన కార్యక్రమం ఆహూతులను ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా ట్రాఫిక్‌ను ఎలా కంట్రోల్ చేయాలి, అడవులు, రోబో, మానవుడి శ్వాసకోశ వ్యవస్థ తదితర ప్రదర్శనలను చిన్నారులు కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. విద్యార్థులకు సమాజంలో జరిగే ప్రతి విషయంపై అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డితో పాటు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా జైలులో రీజినల్ లెవెల్ రిట్రీట్

రాంనగర్, నవంబర్ 23: జిల్లా జైలులో రీజినల్ లెవెల్ రిట్రీట్ -2024 రెండో విడత కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐజీ ఎన్. మురళి బాబు, అతిథులుగా మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. వెంకటరమణ, డాక్టర్ ఎల్. వర్తి, పర్స నాలిటీ డెవలప్‌మెంట్, సైకియాట్రిస్ట్ జక్కని రాజు హాజరై మాట్లాడారు. రీజినల్ లెవెల్ రిట్రీట్‌లో భాగంగా ఖైదీలు, సిబ్బంది సంక్షేమం, క్రమశిక్షణ, ఆరోగ్యం, భద్రత గురించి చర్చించారు. ఆయా అభిప్రాయాలపై స్టేట్ రిట్రీట్‌లో చర్చించి భవిష్యత్తులో జైళ్ల శాఖ ప్రతిష్టను పెంపొందించేలా కార్యక్రమాలు చేపడుతామని జిల్లా జైలు పర్యవేక్షణాధికారి కె శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో జైలు వైద్య అధికారి డాక్టర్ కె. వేణుగోపాల్. జైలర్స్ పి. శ్రీనివాస్, రమేశ్, పరశురామ్, డిప్యూటీ జైలర్స్ ఏ. శ్రీనివాస్ రెడ్డి, ఎస్. సుధాకర్ రెడ్డి, ఎల్. రమేశ్, సంగీత, మినిస్టీరియల్, మెడికల్, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి

శశివర్ధన్‌ను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి

రామడుగు, నవంబర్ 23: గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ విద్యాలయంలో ఎనిమిదో తరగతి చదువుతున్న శశివర్ధన్ ఎస్‌జీఎఫ్ అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 25 నుంచి 27 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు, కాగా, శనివారం అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి శశివర్ధన్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. క్రీడల్లో చక్కని ప్రతిభతో జాతీయస్థాయిలో రాణించి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని దీవించారు. ఇక్కడ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, నవంబర్ 23: కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ 11కేవీ నేచర్ క్యూర్ ఫీడర్ పరిధిలో లైన్ పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కరీంనగర్ రూరల్ ఏడీఈ జీ రఘు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బొమ్మకల్, ధర్మానగర్, కృష్ణా నగర్, ఆటో నగర్, మధురానగర్, వాల్యూ హోమ్స్, విజయనగర్ కాలనీలకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ మృతికి ప్రముఖుల సంతాపం

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 23: విద్యానగర్‌కు చెందిన హెల్త్ అసిస్టెంట్ రమేశ్ శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, శనివారం పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. మృతదేహానికి హనుమకొండ జిల్లా వైద్యాధికారి అప్పయ్య నివాళులర్పించారు. అలాగే తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ రమేశ్ మృతికి సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

వివేకానంద విద్యానికేతన్ విద్యార్థుల చేయూత

వృద్ధాశ్రమంలో ఆహార పదార్థాలు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 23: భగత్ నగర్ వివేకానంద విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు 'పిడికెడు బియ్యం'లో భాగంగా అందుబాటులో ఉన్న కూరగాయలు, నిత్యావసరాలు సమకూర్చుకొని ఒక పూట భోజనం స్వయంగా వారే తయారు చేసి ప్రభుత్వ వృద్ధాశ్రమానికి వెళ్లి వారి కడుపు నింపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను విద్యా సంస్థల చైర్మన్ కొమురయ్య సాగాని అభినందించి మాట్లాడారు. విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు, మానవతా విలువలు పెంపొందించేందుకు 'పిడికెడు బియ్యం' కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మిథున్ జే మిష్ట్రి, వైస్ ప్రిన్సిపాల్ సాగర్, ఏవో తుంగాని సంపత్, ఉపాధ్యాయులు బీ శ్రీనివాస్, రుబీనా, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక

కొత్తపల్లి, నవంబర్ 23: లక్నోలో ఈనెల 25 నుంచి జరుగనున్న జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు రుక్మాపూర్‌లోని సైనిక్‌స్కూల్‌కు చెందిన 11వ తరగతి విద్యార్థి కె. హోంరాజ్ ఎంపికయ్యాడు. విద్యార్థిని ఐఏఎస్ అలుగు వర్షిణి, కార్యదర్శి కేసీ రావు, ప్రిన్సిపాల్ అభినందించారు. అలాగే జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు నగరంలోని రాంనగర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఏ అరుణ్ అండర్-17 విభాగంలో 400 మీటర్ల హార్డిల్స్ పోటీలకు, సవరన్ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి డీ రణధీర్ 5వేల మీటర్ల రేస్‌వాక్‌లో ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయులు భద్రయ్య, దేవారం సతీశ్, వ్యాయామ ఉపాధ్యాయులు చిరంజీవి, లింగారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నేడు ఉచిత సూపర్ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరం

కరీంనగర్ రూరల్, నవంబర్ 23: ప్రతిమ హాస్పిటల్ నగునూర్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని మంకమ్మతోటలో గల ప్రతిమ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సూపర్ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యశాల నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు వైద్య నిపుణులు ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు, ఆపరేషన్ అవసరం అయిన వారిని ప్రతిమ హాస్పిటల్‌కు రెఫర్ చేస్తారని పేర్కొన్నారు. ఈ మెగా క్యాంపును పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9441164416 లేదా 7330738585 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

కేక్ కట్ చేసి.. స్వీట్లు పంచి

రామడుగు, నవంబర్ 23: బీఆర్ఎస్ రాష్ట్